సాక్షి వరంగల్

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



ఓరుగల్లుపై నిప్పులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. మరో నాలుగు రోజులు దంచికొట్టే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

- 8లో▸



మట్టిపెళ్లలు పడి మృతి

పైపులైన్ మరమ్మతు చేస్తుండగా.. మట్టిపెళ్లలు మీదపడి దుగ్గొండి మండలానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
42°/25°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.

ఇఫ్తార్	సహర్
మంగళ 6:38	బుధ 4:33

రంజాన్ వేళలు

తొలి వేడుకకు వేళాయె..

నేడు రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు

- నరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్
- సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరుకానున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ప్రజాప్రతినిధులు
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం పాలంపేటలోని రామప్ప ఆలయంలో తొలిసారిగా మంగళవారం 'శిల్పం వర్ణం కృష్ణం' పేరుతో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉత్సవాలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 20వేల మంది ఉత్సవాలను వీక్షించే విధంగా స్టేజీ నిర్మాణం, గార్డెన్‌లో పలు చోట్ల ఆరు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. వీఐపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వారసత్వ ఉత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి, సింగర్ కార్తీక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. సుమారు 300మందికి పైగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించనున్నారు. వారసత్వ వేడుకలకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జెడ్పీ చైర్మన్ జగదీశ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే సీతక్క హాజరుకానున్నారు.

సరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్

రామప్ప సరస్సు కట్టపై ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రాంతంలోని వివిధ వంటకాలు, రుచులతోపాటు చేనేత ఉత్పత్తులు, చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులను సైతం ప్రదర్శించనున్నారు.

ప్రతిఏటా ఉత్సవాలు

1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి 2021 జూలై 25న యునెస్కో గుర్తింపు లభించింది. ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం, ఆలయానికి ఉపయోగించిన రాయిలో రెండు రంగులు ఉండడం, నీటిలో తేలాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రపంచ వారసత్వ హోదాను కల్పించారు. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత రామప్ప ఆలయంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది.



గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కుర్చీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు



ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గణేష్, అధికారులు

నేటిసాయంత్రం 5గంటల నుంచి కార్యక్రమాలు ఇలా ..

- సాయంత్రం 5 గంటల నుంచి 5:15 వరకు రామప్ప టూరిజం వీడియోస్, సెలబ్రిటీ, స్పాన్సర్ల వీడియోల ప్రదర్శన
- 5:15 నుంచి 5:30 వరకు అనిశ్రితరెడ్డి వెల్కమ్ డాన్స్, ములుగు జిల్లా కళాకారుల ప్రదర్శన, సుధీర్‌రావు బృందంతో కూచిపూడి నృత్యం
- 5:30 నుంచి 6గంటల వరకు 70 మంది వయోలిన్ కళాకారులతో అరబీ వయోలిన్ వాయిద్య కళాకారుడు గురూజీ అశోక్ గుజ్జల్ ప్రదర్శన
- 6గంటల నుంచి 6:15 వరకు యాంకర్ ద్వారా అతిథులను స్టేజీపైకి ఆహ్వానించడం, జ్యోతి ప్రజ్వలన
- 6:15 నుంచి 6:25 వరకు పేరిణి రాజ్‌కుమార్ బృందంతో నృత్య ప్రదర్శన
- 6:25 నుంచి 6:35 వరకు రామప్ప డాక్యుమెంటరీ వీడియో ప్రదర్శన
- 6:35 నుంచి 6:50 వరకు బెంగళూరుకు చెందిన సూర్య ఎస్ రావు బృందంతో 'రావణ' నాటక ప్రదర్శన
- 6:50 నుంచి 6:55 వరకు ప్రోగ్రాం స్పాన్సర్స్‌కు చెందిన వీడియోల ప్రదర్శన
- 6:55 నుంచి 7:20 వరకు హెరిటేజ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రావ్యమానస డాన్స్ అకాడమీకి చెందిన 200 మంది కళాకారులతో క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శనలు
- 7:20 నుంచి 7:30 వరకు బలగం చిత్ర యూనిట్‌కు సన్మానం
- 7:30 నుంచి 7:45 వరకు డ్యాన్స్ డైరెక్టర్ విజయజ్యోతి రాసిన రామప్ప ఆలయ నాట్యశాస్త్ర పుస్తక ఆవిష్కరణ
- 7:45 నుంచి 7:55 వరకు రామప్ప ఆలయ విశిష్టతపై లేజర్ షో ప్రదర్శన
- 8గంటల నుంచి 8:20 వేదికపైకి మంత్రులను ఆహ్వానించడం, అతిథుల ప్రసంగం
- 8:20 నుంచి 9:40 వరకు ఎస్ఎస్ తమన్, శివమణి, కార్తీక్, ఫ్లూట్ నవీన్ ప్రదర్శనలు
- 9:40 నుంచి 9:55 వరకు ముగింపు కార్యక్రమం

ఉత్సవాలకు సిద్ధం

ములుగు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ప్రపంచ వారసత్వ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ములుగు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ తెలిపారు. రామప్పలో వారసత్వ ఉత్సవాల ఏర్పాట్లను డీఆర్‌ఓ రమాదేవితో కలిసి సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఉత్సవాలను ప్రజలు వీక్షించేందుకు మంగళవారం ఉదయం నుంచి హనుమకొండ, ములుగు ప్రాంతాల నుంచి రామప్పకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్, డీసీఓ సర్దార్‌సింగ్, డీడబ్ల్యూఓ ప్రేమలత, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ పంతకంటి మంజుల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రామప్పను ఓఎస్డీ అశోక్ కుమార్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై తాజుద్దీన్ సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి

- కలెక్టర్ పి.ప్రావీణ్య



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు

వరంగల్: ప్రజావాణిలో పెండింగ్ అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆమె సంబంధిత అధికారులకు పంపించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటిని పరిష్కరించే బాధ్యత ప్రతీ అధికారిపై ఉందన్నారు. వివిధ సమస్యలపై 67 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భూ సమస్యలపై 28, వరంగల్ ఆర్డీఓకు 8, 'కుడా'కు 1, డీఈఓకు 3, కలెక్టరేట్ సి సెక్షన్‌కు 3, డీఆర్డీఓకు 3, మిషన్ భగీరథకు 1, ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌కు 4, ఆర్టీసీకి 1, డీఈఓకు 4, పోలీస్ కమిషనర్‌కు 1, ఎంప్లాయిమెంట్‌కు 1, డీపీఓకు 1, జీడబ్ల్యూఎంసీకి 1, దేవాదాయ శాఖ వరంగల్‌కు 1, ఇతర సమస్యలపై 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(ఎల్‌బీ)అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీవత్స కోట, ఆర్డీఓ మహేందర్‌జీ, డీఆర్డీఓ సంపత్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'పై నేడు అవగాహన సదస్సు

వరంగల్: మిషన్ వాత్సల్య పథకం- బాలల హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం హనుమకొండ వడ్డేపల్లిలోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో సదస్సు ఏర్పాటు చేసినట్లు వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని సర్పంచ్‌లు, ఎంపీపీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగాలు, గ్రామ బాలల పరిరక్షణ కమిటీలకు బాలల హక్కులపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

అబార్షన్‌లు చేస్తే చర్యలు

- సాధారణ ప్రసవాల్ని ప్రోత్సహించాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్



నర్సంపేట: ప్రైవేట్ ఆస్పత్రుల్లో చట్ట వ్యతిరేకంగా భ్రూణహత్యలు, అనవసరమైన అబార్షన్లు, అవసరం లేని సిజేరియన్ ఆపరేషన్లు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ హెచ్చరించారు. పట్టణంలోని వేద, పావని, మమత, మల్లికార్జున ఆస్పత్రులను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయకుండా.. గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్ చేయకుండా సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రతీ గర్భిణి వివరాలు పొందుపర్చాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ నంద, ఆరోగ్య విద్యా బోధకురాలు మార్త పాల్గొన్నారు.

నేడు టీజీఓ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీఓ) అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఉమ్మడి సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18న నిర్వహించనున్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్‌రావు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి టీజీఓ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, టీజీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, అధికారుల పాత్ర, గెజిటెడ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల గెజిటెడ్ అధికారులంతా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



వరంగల్: వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నలుగురికి కారుణ్య నియామక ఉత్తర్వులను వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అందజేశారు. ఆఫీస్ సబార్డినేట్లుగా నియామక ఉత్తర్వులు పొందిన వారిలో పోలాల గణేశ్(మచ్చాపూర్), భూక్య క్రాంతికుమార్ (చెన్నారావుపేట), మహ్మద్ రాహిల్ (వర్ధన్నపేట), బండారి గంగాదేవి(పోనకల్) ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సంపత్‌రావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారమివ్వాలి

వర్ధన్నపేట: పైప్‌లైన్ మరమ్మతు చేస్తుండగా.. మట్టిపెళ్లలు పడి మృతి చెందిన దుగ్గొండి మండలం దేశాయిపల్లి జీపీ వాటర్‌మెన్ శంకర్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం(బీఆర్టీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు పరిహారం అందించాలని ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కంజర్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శి జన్ను శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

'నిరుద్యోగ మార్చ్' విజయవంతం

- బండి సంజయ్‌పై తప్పుడు కేసులు పెట్టారు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట: బీజేపీ చేపట్టిన నిరుద్యోగ మార్చ్ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొన్న యువతను అవమానించేలా ఎమ్మెల్యే రమేశ్ మాట్లాడడం తగదన్నారు. తెలంగాణ ప్రజలకు, నిరుద్యోగులకు సీఎం క్షమాపణ చెప్పి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవాలన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ చేసి ఉద్యోగాల్ని అమ్ముకోవాలని యత్నించినట్లు ఆరోపించారు. పదోతరగతి పేపర్ మాల్ ప్రాక్టీసింగ్ వ్యవహారంలో ఏ సంబంధం లేని బండి సంజయ్‌పై తప్పుడు కేసులు బనాయించారని మండిపడ్డారు. ప్రపంచానికి మార్గదర్శిగా నరేంద్ర మోడి నాయకత్వంలో భారత్ నిలుస్తోందని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పనులు జరుగుతున్నాయని, మాయ మాటలు చెబుతున్న బీఆర్ఎస్‌ను తెలంగాణ యువత బొంద పెట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేతో రోడ్డున పడతాం

- నెక్కొండ, పత్తిపాక రైతులు



అధికారులతో మాట్లాడుతున్న రైతులు

నెక్కొండ: నాగపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో విలువైన భూములు కోల్పోయి రోడ్డున పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నెక్కొండ, పత్తిపాక గ్రామాల రైతులతో స్థానిక రైతు వేదికలో సోమవారం నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జాతీయ రహదారుల సంస్థ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణ అవార్డు విచారణ కార్యక్రమం జరిగింది. రహదారి నిర్మాణ భూ సేకరణ ప్రకటన విచారణ సందర్భంగా ఆర్డీఓ రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెక్కొండ శివారులో 45 మంది రైతులకు చెందిన 24.10 ఎకరాలు, పత్తిపాక శివారు 62 మంది రైతులకు చెందిన 20.12 ఎకరాలకు ప్రభుత్వ ధర ప్రకారం చెల్లించడం జరుగుతుందన్నారు. రహదారులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. రైతులంతా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ..ఎకరాకు కోటి రూపాయలు, భూమి కోల్పోయిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తేనే రహదారి నిర్మాణానికి భూములిస్తామని రైతులు పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైతులు ఆర్డీఓకు అందించారు. రైతుల డిమాండ్లు, అభ్యంతరాలను కలెక్టర్‌కు, జాతీయ రహదారుల రీజనల్ అధికారులకు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజు, తహసీల్దార్ డీఎస్.వెంకన్న, డీఐ శ్రీనివాస్, ఆర్ఐ నరేందర్, సర్వేయర్ కుషల్‌కుమార్, సిబ్బంది రషీద్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రామప్పకు ప్రత్యేక బస్సులు



హన్మకొండ: ప్రపంచ వారసత్వ వేడుకలు నిర్వహిస్తున్న రామప్ప ఆలయం వద్దకు మంగళవారం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీదేవి తెలిపారు. హనుమకొండ, ములుగు నుంచి రామప్పకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. చార్జీలు హనుమకొండ నుంచి రామప్పకు పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, ములుగు నుంచి పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.30గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించాలనుకుంటున్న ఆసక్తిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాబోరేటరీ ప్రారంభమెప్పుడో?

వైరాలజీ ల్యాబ్ కోసం దాదాపు రూ.1.50 కోట్లు మంజూరు

- పనులు పూర్తయినా.. ప్రారంభానికి జాప్యం
- కోవిడ్ ఆర్టీపీసీఆర్ టెస్టుల కోసం కేఎంసీనే గతి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైరాలజీ లాబోరేటరీ

నర్సంపేట రూరల్: కోవిడ్ విజృంభించిన సమయంలో నర్సంపేట ప్రభుత్వాస్పత్రితోపాటు డివిజన్‌లోని ఆరు మండలాల పీహెచ్‌సీ కేంద్రాల్లో రాపిడ్ టెస్టులు చేసి ఫలితాలు వెంటనే వెల్లడించారు. ఆర్టీపీసీఆర్ టెస్టుల కోసం మాత్రం నమూనాలు సేకరించి కాకతీయ మెడికల్ కాలేజీకి పంపించేవారు. అక్కడ బాగా బిజీగా ఉండడంతో హైదరాబాద్‌కు పంపించి, రిపోర్టు వచ్చే వరకు వేచి చూసేవారు. దీంతో కోవిడ్ వచ్చిందీ లేనిదీ తెలియడానికి రెండు, మూడ్రోజులు సమయం పట్టేది. నర్సంపేట జిల్లా ఆస్పత్రికి 2022 ఫిబ్రవరిలో వైరాలజీ లాబోరేటరీ కేంద్రం మంజూరైంది. రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పరికరాలు సైతం లాబోరేటరీకి వచ్చాయి. వైరాలజీ లాబోరేటీ కోసం ఆస్పత్రి క్వార్టర్‌లోని ఒక భవనాన్ని కేటాయించారు. చిన్న చిన్న మరమ్మతులు చేయించి అందంగా తీర్చిదిద్దారు. పరికాలన్నింటినీ ఆర్నెళ్లలో ఆభవనంలోకి చేర్చారు. కానీ ఇప్పటి వరకు ఆ లాబోరేటరీ ప్రారంభించలేదు. తమకు అవసరమైన పరీక్షలు చేసేందుకు లాబోరేటరీ ఉపయోగపడుతుందని పేదలు ఆశపడ్డప్పటికీ నిరాశే మిగిలింది.

ఎదురుచూపులు

తొలుత లాబోరేటరీకి భవన సముదాయం లేదు. క్వార్టర్ భవనంలో ఈసెంటర్ ప్రారంభించాలనే నిర్ణయంతో మరమ్మతులు చేయించారు. అనంతరం వైరాలజీ లాబోరేటరీకి వచ్చిన పరికరాలైన డిజిటల్ వర్టెక్స్ మిక్సర్, ఆటో క్లేవ్, లూమినర్ ఎయిర్ ఫ్లో, రిఫిజిరేటెడ్ సెంట్రి ఫ్యూజ్, హాటీఎర్ ఓవెన్, రియల్ టైం పీసీఆర్ మిషన్-2, ఆటోమేటెడ్ ఆర్ ఎన్ఏ ఎక్స్‌ట్రాక్టర్, కోల్డ్ ప్లేటెడ్ సెంట్రిఫ్యూజ్, మైక్రో స్పిన్, హెచ్ఎఫ్ సేఫ్ 1200 ఎల్‌సీ బయోసేఫ్టీ క్యాబినెట్ లెవల్ 11, అడ్జెస్టబుల్ వాల్యూమ్ డిజిటల్ పిపెట్స్, డీప్ ఫ్రీజర్ 20 డిగ్రీ సెంటిగ్రేడ్, డీప్ ఫ్రీజర్ 80 డిగ్రీ సెంటిగ్రేడ్, మైక్రో బయోలాజీ ఇంకిబేటర్, సెరోలాజికల్ వాటర్ బాత్, అల్ట్రా వాయిలెట్ క్యాబినెట్-2, మైక్రో పిపెట్స్-4లు ఏర్పాటు చేశారు. ఈసెంటర్ ప్రారంభమైతే అన్ని పీహెచ్‌సీలకు సంబంధించిన ఆర్టీపీసీఆర్ టెస్టుల రిపోర్టులను త్వరితగతిన అందించే అవకాశం ఉంది. అన్ని పరికరాలు లాబోరేటరీలో ఉన్నప్పటికీ ఈభవనానికి 10 ఏసీలు, సీసీ కెమెరాలు కావాల్సి ఉంది. వీటి కోసం దాదాపు రూ.5లక్షల నిధులు కావాలి. ప్రతిపాదనలు సైతం పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. మళ్లీ కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో సెంటర్‌ను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



నర్సంపేట జిల్లా ఆస్పత్రికి ఆర్టీపీసీఆర్ సెంటర్ మంజూరైంది. పనులు పూర్తి చేశాం. ఈ సెంటర్ ప్రారంభించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే ప్రారంభిస్తాం.

– డాక్టర్ గోపాల్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి నర్సంపేట

గ్యాస్ ప్రమాదాలు-నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాయపర్తి: వంట గ్యాస్ లీకేజీ ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట అగ్నిమాపక శాఖ అధికారి భద్రయ్య సూచించారు. సోమవారం మండలంలోని కొండూరులో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మహిళలకు గ్యాస్ లీక్ ప్రమాదాలు-నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గదిలో గ్యాస్ లీక్ అయినట్లు వాసన వస్తే, ఆ గది కిటికీలు తెరవాలని, సిలిండర్‌ను బయటకు తీసుకురావాలన్నారు. ఆసమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు వేయకూడదని, గ్యాస్ లీక్ ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆ కాంట్రాక్టర్లను గుర్తించి నోటీసులు జారీ చేయాలని మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య ఆదేశించారు. నగరంలో పురోగతిలో ఉన్న పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, 15 ఆర్థిక సంఘం, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌తోపాటు తాగునీటి సరఫరాపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. టెండర్లు పూర్తయిన పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనులకు టెండర్లు నిర్వహించాలన్నారు. పనులను దగ్గర ఉండి పూర్తి చేయించాలన్నారు. నగరంలో మంచినీటి సరఫరా తీరును సమీక్షిస్తూ వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టడంతోపాటు అన్ని డివిజన్లో మంచినీటి సరఫరా సవ్యంగా సాగాలన్నారు. ఇంజనీర్లు ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో నీటిసరఫరా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే అధిగమించాలన్నారు. పైపులైన్లు, పంపింగ్ సమస్యలు ఉన్న కాలనీలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరందించాలన్నారు. నీటి సరఫరా ఇబ్బందులు లేకుండా ఎండకాలం కోసం ప్రత్యేకంగా 2 నెలల పాటు దినసరి ప్రాతిపదికన కార్మికులను నియమించుకోవాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన నాలాల్లో పూడికతీత ప్రక్రియ టెండర్లు పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సమీక్షలో బల్దియా, పబ్లిక్ హెల్త్ ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, శ్రీనివాసరావు, ఈఈలు శ్రీనివాసరావు, రాజయ్య, రాజ్ కుమార్, డీఈలు రవి కుమార్, నరేందర్, సంతోష్ బాబు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలి




తొర్రూరులో డీసీఐసీ ఇన్‌చార్జ్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనారాయణ

తొర్రూరు: మోసగించిన ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్ వాహన కంపెనీల నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుడు వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించాడు. సోమవారం డివిజన్ కేంద్రంలో వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా ఇన్‌చార్జ్ విజయమూరి సుధాకర్‌కు పట్టణానికి చెందిన బైరు లక్ష్మీనారాయణ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. లక్ష్మీనారాయణ, అతని భార్య జయలక్ష్మిలు ఖమ్మంలోని పీసీఎల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2008లో సభ్యులుగా చేరి రూ.16 వేల ఇన్సూరెన్స్ చేశారు. 2015తో కాలపరిమితి ముగియగా ఖాతాదారుకు అసలు, వడ్డీతో నగదు అందించాల్సి ఉంది. సదరు కంపెనీ దాన్ని విస్మరించడంతో వినిపిస్తూ బాధితులు డీసీఐసీ ఇన్‌చార్జ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మరో ఫిర్యాదులో సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలోని ప్యూర్ ఈవీ కంపెనీకి చెందిన ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాన్ని 2020లో లక్ష్మీనారాయణ కొనుగోలు చేశారు. ద్విచక్రవాహన బ్యాటరీ కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ వరకు ఉన్నా ఫిబ్రవరిలోనే పాడైంది. దీంతో ఎలక్ట్రానిక్ వాహనాన్ని బయటకు తీసుకెళ్లే వీలులేకుండా పోయింది. పాడైన బ్యాటరీ విషయాన్ని కంపెనీకి తెలుపగా నిర్లక్ష్య సమాధానమిచ్చారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న బాధితుడు వాహనం లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో వినియోగదారుల బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇన్సూరెన్స్ కంపెనీ, ఎలక్ట్రానిక్ వాహన కంపెనీ నుంచి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై ఇరు కంపెనీలకు నోటీసులు పంపి పరిహారం అందేలా చేస్తామని సుధాకర్ తెలిపారు.

ఓరుగల్లుపై నిప్పులు



- గ్రేటర్ వరంగల్‌పై నిప్పుల కుంపటి
- 43డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దంచికొడుతున్న ఎండలు
- మరో నాలుగు రోజులు ఎండల తీవ్రత
- ఆరెంజ్ జోన్‌లో ఐదు జిల్లాలు.. అలర్ట్ ప్రకటించిన అధికారులు



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన వరంగల్‌లోని బట్టల బజార్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి

సాక్షిప్రతినిధి, వరంగల్: ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయనుంచే తీవ్రతను పెంచుతున్న ఎండలు మధ్యాహ్నం అయ్యే వరకు తారాస్థాయికి చేరుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోంది. ఆదివారం నుంచి తీవ్రరూపం దాల్చిన ఎండలు సోమవారం నిప్పుల కుంపటిని తలపించాయి. గ్రేటర్ వరంగల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో 41–42 డిగ్రీలకు చేరింది. మరో నాలుగు రోజులు కూడా ఎండలు మండిపోయే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయగా, జనగామ మినహా ఐదు జిల్లాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు పేర్కొంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎండలో తిరగవద్దని, వడదెబ్బ ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

బాబోయ్ ఇవేమి ఎండలు..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా పెరుగుతున్న పగటి పూట ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రేటర్ వరంగల్‌తోపాటు వరంగల్, హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు మహిళలు, వృద్ధులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది అందుబాటులో వస్తూ సాయంత్రమైతే తప్ప ఇళ్లకు వెళ్లడం లేదు. పల్లె జనాలు, నగరవాసులు ఉదయం 10 గంటల లోపే పనులు పూర్తి చేసుకుని ఇళ్లలోకి చేరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మరో రెండు రోజుల్లో 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.



గ్రేటర్ వరంగల్‌లో ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న వరంగల్ - ఖమ్మం రోడ్డు

అధికారుల అలర్ట్.. ప్రకటన

గ్రేటర్ వరంగల్ నగరంలోని ఆటోనగర్, ఐడీపీ రాంపూర్, హంటర్‌రోడ్, ఆరెపల్లి, హసన్‌పర్తి, మడికొండ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. జిల్లాల వారీగా చూస్తే హనుమకొండలో 42.1, వరంగల్ 42, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనూ 42 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మహబూబాబాద్, జనగామలలో 41 డిగ్రీల చొప్పున నమోదు కాగా, నేడు, రేపు, ఎల్లుండి 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీలకు చేరవచ్చన్న వాతావరణ శాఖ ప్రకటనతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీలు సెల్సియస్‌లలో)

జిల్లా	16.04	17.04
హనుమకొండ	43.0	43.1
వరంగల్	42.7	42.0
ములుగు	42.7	42.0
జేఎస్‌భూపాలపల్లి	42.6	42.0
మహబూబాబాద్	43.0	42.0
జనగామ	42.0	41.0

ఒక్కసారిగా పెరిగాయి



ఒక్కసారిగా ఎండలు పెరిగాయి. పది దాటిందంటే బయటకు వెళ్లే పరిస్థితి లేదు. నాకు డబ్బాల్లీపేట కిరాణం తయారు చేసే దుకాణం ఉంది. సమయంతో పని లేకుండా గిరాకీ వచ్చేది. ఎండల కారణంగా పనిలేసే వారికి, ఖరీదు వచ్చే వారికి ఇబ్బంది అయితంది.

– ఇప్పకాయల మహేష్, వ్యాపారి, వరంగల్

ఈ ఎండలు భరించలేకపోతున్నం



ఎండల తీవ్రతను భరించలేకపోతున్నాం. ఏప్రిల్ నెల ప్రారంభంలో ఎప్పుడు ఈ స్థాయి ఎండలను చూడలేదు. మరి రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11 గంటల వరకే బయటకు వెళ్తున్నాం. ఈసారి ఎండలు భయంకరంగా ఉన్నాయి.

– పేపర్ శ్రీను, స్థానికుడు, శివనగర్

ప్రైవేట్ స్కూల్‌లో 18 మందికి కరోనా

- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పిల్లలను ఇళ్లకు పంపించిన పాఠశాల యాజమాన్యం



కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గార్ల: స్థానిక బీఎస్‌ఎస్ (ప్రైవేట్) పాఠశాలలో 18 మంది విద్యార్థులు, సిబ్బందికి కరోనా పాజిటివ్ రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీరిలో 14 మంది విద్యార్థులు, నలుగురు సిబ్బందికి పాజిటివ్ వచ్చినట్లు ముల్కనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ తెలిపారు. తొలుత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు జ్వరం, జలుబు తగ్గకపోగా, వాసన రాకపోవడంతో అనుమానం వచ్చిన పాఠశాల సిబ్బంది గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యాధికారి హనుమంతరావు కరోనా పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి పాజిటివ్ వచ్చింది. పాఠశాలలోని విద్యార్థులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించాలని వైద్యుడు అవినాష్‌కు ఆయన సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యుడు తన సిబ్బందితో పాఠశాలలోని 60 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో మొత్తం 18 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. వెంటనే పాఠశాల యాజమాన్యం పాజిటివ్ వచ్చిన వారిని పాఠశాల వసతిగృహంలోని ఐసోలేషన్ గదిలో ఉంచి, మిగతా విద్యార్థులను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారి ఇళ్లకు పంపించారు. అప్రమత్తమైన తహసీల్దార్ రాము, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, పంచాయతీ సిబ్బందితో పాఠశాల ప్రాంగణంలో బ్లీచింగ్ చల్లించి, శానిటేషన్ చేయించారు. పట్టణంలో ఒకేసారి 18 మందికి కరోనా రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇస్మాయిల్ బేగ్, పద్మ, పార్వతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్టిపెళ్లలు పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి



శంకర్(ఫైల్)



మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న బంధువులు, కుటుంబసభ్యులు

దుగ్గొండి: పైపులైన్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు మట్టిపెళ్లలు మీదపడి పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు వేణువంక శంకర్ (54) రోజువారి విధుల్లో భాగంగా కొంతమందితో కలిసి గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైన్‌కు గుంతతీసి పైపులు సరిచేస్తుండగా గుంత పైభాగంలో ఉన్న మట్టి ఒక్కసారిగా కూలడంతో శంకర్ అందులో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాజక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీపీ కట్ల కోమలభద్రయ్య, ఎంపీడీఓ క్రిష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్ మృతికి స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులే కారణమని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని పారిశుద్ధ్య కార్మికుల సంఘాల నాయకులు హెచ్చరించారు.

సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన...

పారిశుద్ధ్య కార్మికుడు వేణువంక శంకర్ మృతికి స్థానిక సర్పంచ్ పాశం పోశాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి ఎదుట ఉంచి సోమవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి రూ. 20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గుంతతీయాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు చెప్పడంతో పైపులు సరిచేస్తుండగా ప్రమాదం జరిగిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేందర్

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఖాదర్‌పేట శివారులోని క్రాస్ రోడ్ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన పరికిరాల సంతోష్(38) హైదరాబాద్‌లో కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సంగెం రాంచంద్రు బొజ్జ బిడ్డ జలజ మృతి చెందింది. ఆమె దశదిన కార్యక్రమానికి సంతోష్ సోమవారం ఉదయం వచ్చాడు. తిరిగి బైక్‌పై నర్సంపేటకు వెళ్తున్న క్రమంలో ఖాదర్‌పేట గ్రామ శివారులోని క్రాస్‌రోడ్డు వద్ద అశోక్ లేలాండ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో సంతోష్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బయ్యారంలో...



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బయ్యారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కొత్తపేటలో చోటుచేసుకుంది. కాచనపల్లికి చెందిన ఉఊకే సందీప్(20) మోటార్‌సైకిల్‌పై కొత్తపేట నుంచి ఇల్లందు–మహబూబాబాద్ రహదారిపై నామాలపాడు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న మ్యాజిక్ వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రమాదేవి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- చంపి ఉరివేశారని మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ, సీఐ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో కర్రి జ్యోతి(20) వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు పరిశీలించారు. తమ కూతురును చంపి ఉరివేసి ఆత్మహత్య చేసుకుందని చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లిదండ్రులు చక్రధర్, శివలీల ఆరోపించారు. తండ్రి చక్రధర్ తమ కూతురు చనిపోయిన విషయం కూడా తమకు చెప్పలేదని గ్రామస్తులు 2.30 గంటల సమయంలో తమకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వెంటనే వచ్చి చూసేసరికి ఇంట్లో ఫ్యానుకు వేలాడుతూ కనిపించిందన్నారు. కాళ్లు బెడ్‌పై ఆనుకున్నాయని భోరున విలపించారు. భర్త మోహన్ కుటుంబ సభ్యులపై తమకు అనుమానం ఉందని వాపోయారు. మృతురాలి భర్త మోహన్, తన అన్న నవీన్, వదిన మణిని ఏమి జరిగిందని ఏఎస్పీ ప్రశ్నించారు. తమకు ఎలాంటి మనస్పర్థలు గానీ గొడవలు లేవన్నారు. తాము వరికోతలు కోసేందుకు ఉదయం ఇంటి నుంచి వెళ్లామని మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సమయంలో బెడ్‌రూమ్ తలుపులు మూసి ఉన్నాయని పిలిచినా పలుకకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని కనిపించిందన్నారు. వెంటనే ఇరుగు పొరుగు వారికి చెప్పామని విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు మృతురాలి భర్త మోహన్, బావ నవీన్ ఏఎస్పీకి వివరించారు. మృతురాలు భర్తను విచారించిన పోలీసులు మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ జరిపి దర్యాప్తు చేస్తామన్నారు. ఈ సందర్భంగా తమ కూతురిది ఆత్మహత్య కాదని ఆదనపు కట్నం కోసం హత్య చేశారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని కోరారు.

మిల్లులో బోల్టులు ఊడిపడి మహిళ..

- క్లీనింగ్ చేస్తుండగా ఘటన



కవిత మృతదేహం

వరంగల్: గ్రేటర్ పరిధిలోని 3వ డివిజన్ పరిధి కొత్తపేట సమీపంలోని జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్‌కు చెందిన కారంపొడి మిల్లులో సోమవారం జరిగిన దుర్ఘటనలో శివనగర్‌కు చెందిన ప్రతాపగిరి కవిత(29) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టోర్ మిల్లులో మిర్చిని పొడిగా మార్చే భారీ పరికరం(డెక్కన్)ను మెకానిక్ క్లీనింగ్ చేస్తున్న క్రమంలో దాని బోల్టులు ఊడిపడటంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కవితపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు ఉదయ్‌కిరణ్, కూతురు సుశీల ఉన్నారు. ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై రాజబాబు తెలిపారు. ఆమె ఫిర్యాదులో మిల్లు యాజమాన్య నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందినట్లు భర్త వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఏనుమాముల సమీపంలో బాలాజీనగర్‌లో ఐదేళ్ల క్రితం పల్లిమిల్లులో జరిగిన సంఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఇండస్ట్రీస్‌లో పురుషులు చేయాల్సిన యంత్రాల వద్ద మహిళలతో చేయిస్తుండగా.. జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సందర్శించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.

దినసరి కూలీగా సర్పంచ్

- అటు సర్పంచ్‌గా విధులు, ఇటు కుటుంబ పోషణకు పనులు
- కష్టాల కడలిలో ప్రథమ పౌరురాలు ఉప్పమ్మ



ఎండలో మిర్చి ఏరుతున్న సర్పంచ్ ఉప్పమ్మ



సర్పంచ్ ఉంటున్న రేకుల ఇల్లు

మరిపెడ రూరల్: ఆ గ్రామానికి ఆమె ప్రథమ పౌరురాలు. ఇల్లు గడవక తోటి కూలీలతో కూలీ పనులకు వెళ్తోంది. ఓ పక్క గ్రామసర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూనే, మరో పక్క కుటుంబ పోషణ కోసం దినసరి కూలీగా పనులకు వెళ్తోంది. మండలంలోని వెంకంపాడు గ్రామం ప్రత్యేక తెలంగాణ తర్వాత కొత్త జీపీగా ఏర్పాటైంది. రిజర్వేషన్ కారణంగా 2019 జనవరి 25న సర్పంచ్‌గా తొట్ల ఉప్పమ్మ ఎన్నికైంది. పంచాయతీ మొదటి సర్పంచ్‌గా ఎన్నిక కావడంపై ఆనాడు ఆమె ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేసింది. కానీ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షల్లో చేసిన అప్పులు తీర్చలేక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా బాగా కుదేలైంది. కుటుంబం దీనస్థితిలోకి వెళ్లింది. గతంలో హైదరాబాద్ మాజీ ఎమ్మెల్యే మల్లు మధు, వైజాగ్ మాజీ ఎమ్మెల్యే వద్ద విజయ్‌ప్రసాద్ వద్ద సర్పంచ్ భర్త వెంకన్న వాచ్‌మెన్‌గా పనిచేస్తూ పిల్లలను చదివించుకున్నాడు. ఈ క్రమంలో వెంకంపాడు కొత్తగా జీపీగా ఏర్పాటైంది. గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం మీకే ఉందని కొందరు గ్రామస్తులు వారిని ఒప్పించారు. వారి మాటలు విని ప్రజలకు సేవ చేసే భాగ్యం కలుగుతుందని పట్టణం నుంచి మూట ముల్లె సదురుకొని పల్లెకు బాట చేరుకున్నారు. కూతురు పెళ్లి కోసం దాచిన డబ్బులతో పాటు మరికొన్ని అప్పులు తెచ్చి ఎన్నికల్లో ఖర్చు చేశారు. గత మూడేళ్లుగా ఆరకొర వచ్చిన నిధులతో గ్రామాభివృద్ధికి సంపాకే చేశారు. సొంత మరికొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేసింది. సర్పంచ్‌గా గౌరవ వేతనం అందడం లేదు. పెళ్లీడుకొచ్చిన కూతురుకు పెళ్లి చేద్దామన్నా చేతిలో చిల్లిగవ్వ లేదు. గ్రామంలో సెంటు భూమి లేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని ఇస్తారన్న ఆశతో ఉన్న ఇంటిని నేలమట్టం చేసి రేకుల షెడ్డు వేసుకున్నామని ఆవేదన చెందింది. ఇటీవల క్రమంలో అప్పులోల్లు ఇంటి చుట్టు తిరుగుతుంటే పరువు పోతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. చేసేది ఏమిలేక దినసరి కూలీగా మిర్చి వేరడానికి ఎర్రటి ఎండలో రూ.200 కూలీకి వెళ్తున్నట్లు భోరున విలపించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పుడు మాత్రమే పాల్గొని, మిగిలిన సమయంలో దినసరి కూలీ పనులకు వెళ్తుంది. నాలాంటి కష్టాలు ఏ ప్రజాప్రతినిధికి కూడా రాకూడదని, ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి పెండింగ్‌లో పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే విడుదల చేయించి తమను కష్టాల ఊబిలోనుంచి గట్టెక్కించాలని సర్పంచ్ ఉప్పమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సీజేఐటీలో విద్యార్థినికి గాయాలు

- హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు

జనగామ: స్థానిక క్రిస్టుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థిని గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన విద్యార్థిని సీజేఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుకుంటుంది. తన సోదరుడు కూడా ఇందులోనే ద్వితీయ సంవత్సరంలో ఉన్నాడు. ఇద్దరు కలిసి సుమారు ఉదయం 10 గంటల సమయంలో కళాశాలకు వచ్చారు. చెల్లెను అక్కడే దింపి..పరీక్ష రాసేందుకు సోదరుడు నేరుగా తరగతి గదిలోకి వెళ్లాడు. విద్యార్థిని తరగతి గదికి వెళ్లకుండా కళాశాల వెనుకభాగం వైపు ఎందుకు వెళ్లిందో తెలియడం లేదు. కళాశాల భవనం వెనుకవైపు ఓ తరగతి గది పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని సిబ్బంది గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులతో పాటు కళాశాలలో ఉన్న సోదరునికి సమాచారం అందించి, లోకల్‌గా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యపరీక్షల కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు సీఐ ఎలబోయిన శ్రీనివాస్ కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థిని పడి ఉన్న స్థలంతో పాటు రోడ్డుపక్కన ఉన్న ప్రహరీ, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థిని సోదరుడిని పిలిపించి వెంట తిరిగి పరిపోవద్దని చెప్పారు. ఈ విషయమై కళాశాల డైరెక్టర్ అగస్టిన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని కళాశాలకు వచ్చిన తర్వాత తరగతి గదికి వెళ్లలేదన్నారు. సుమారు ఉదయం 10.30 గంటల సమయంలో భవనం వెనకాల విద్యార్థిని పడి ఉందని సిబ్బంది తెలపడంతో ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. సీఐ మేరకు ఇక్కడికి వచ్చి ప్రాథమిక విచారణ చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థిని స్పృహలోకి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

జీపీ వర్కర్ అనుమానాస్పద మృతి



యాకూబ్‌పాషా మృతదేహం

మంగపేట: స్థానిక గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్న మండల కేంద్రంలోని ముస్లింవాడకు చెందిన ఎస్‌కే యాకూబ్‌పాషా(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మండల కేంద్రంలోని ఓ పాఠశాల సమీపంలో ఉన్న ఓ షాపు యజమాని బల్లు దొంగిలించాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి తీవ్రంగా కొట్టాడు. ఈ సంఘటన షాపు యజమాని సీసీ కెమెరాలో రికార్డు అయింది. తెల్లవారేసరికి మృతుడు రోడ్డు పక్కన షాపుల ముందు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 100 మంది పోలీస్‌స్టేషన్ ఎదుట, మండల కేంద్రంలోని గంపోనిగూడెం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధానరోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఆదివారం రాత్రి కొట్టబడిందని వ్యాపారి బ్రహ్మాజీ కొట్టడం వల్లనే యాకూబ్‌పాషా మృతి చెందాడన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై తాహెర్ బాబా అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎస్సైగా ఉన్న సుమారు 200 మంది ముస్లింలు రాస్తారోకోలో పాల్గొన్నారు. పోలీసులు సీఐ రాజుకు సమాచారం ఇచ్చారు. నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాస్తారోకో చేస్తున్న వారికి సర్దిచెప్పారు. మృతుని తల్లి మహబూబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో శాంతించారు.